# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 28-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ రక్షణ రంగంలో భారత్ సామర్థ్యం పురోగతి సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ సరిహద్దు వెంబడి ఆందోళనకర పరిస్థితి నెలకొనడం భారత్, చైనా దేశాల సంబంధాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ అన్నారు.

❖ భారతదేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

❖ రోజ్‌గార్ మేళా ద్వారా రేపు 51 వేల మంది యువతకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నియామక పత్రాలను అందజేయనున్నారు.

❖ విపత్తు సంసిద్ధత, ప్రతిస్పందన కోసం కమ్యూనిటీ వాలంటీర్లకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర హోం శాఖ యువ ఆపద మిత్ర పథకాన్ని రూపొందించింది.

=================================

రక్షణ రంగంలో భారత్ సామర్థ్యం పురోగతి సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు ఆయన స్పెయిన్ ప్రభుత్వ అధ్యక్షులు పెడ్రో శాంచెజ్ తో కలిసి గుజరాత్‌లోని వడోదరలో ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... గ్లోబల్ ఏరోస్పేస్ తయారీలో విశ్వసనీయ భాగస్వామిగా భారత్ స్థానాన్ని టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ బలోపేతం చేస్తుందన్నారు. సీ-295 ఎయిర్ క్రాఫ్ట్ తయారీ కర్మాగారాన్ని ప్రారంభించామని, ఇది భవిష్యత్ లో భారత్ - స్పెయిన్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, "మేక్ ఇన్ ఇండియా"కు సాధికారత చేకూరుస్తుందని నరేంద్ర మోదీ పేర్కొంటూ.....

(వాయిస్ 36 సెకన్లు)

=================================

వాస్తవాధీన నియంత్రణ రేఖ (ఎల్ఏసి) వెంబడి భారత్ - చైనా దేశాల సైనిక ఉపసంహరణ ఈరోజు పూర్తవుతుందని, అయితే తూర్పు లడఖ్ లోని డెప్సాంగ్ మైదానాలు, డెమ్‌చోక్ లో ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఇరు దేశాల మధ్య జరిగిన సైనిక ఉపసంహరణ ఒప్పందం డెమ్‌చోక్, డెప్సాంగ్ మైదానాలకు మాత్రమే సంబంధించినదని, ఇతర ప్రదేశాలకు ఈ ఒప్పందం వర్తించదని పేర్కొన్నాయి. లడఖ్ సరిహద్దులోని రెండు ప్రాంతాల వద్ద సైనిక ఉపసంహరణ మొదటి దశ అని, ఉద్రిక్తతలను తగ్గించడం రెండవ దశ అని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. సరిహద్దు వెంబడి ఆందోళనకర పరిస్థితి నెలకొనడం ఇరు దేశాల మధ్య సంబంధాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని విదేశాంగమంత్రి పేర్కొన్నారు.

=================================

భారతదేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈ వృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీహెచ్‌యూ) 13వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. పరిశోధన సామర్థ్యాలను పెంపొందించే 400 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు ఈ సందర్భంగా ఆయన శంకుస్థాపన చేశారు. ఐఐటీ బీహెచ్‌యూలో ప్రతిభ కనబరిచిన 1954 మంది విద్యార్థులకు స్నాతకోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి పట్టాలను అందజేశారు.

=================================

రోజ్ గర్ మేళా ద్వారా 51 వేల మంది యువతకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియామక పత్రాలను అందజేయనున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో చేరిన వారితో రోజ్‌గార్ మేళా దేశవ్యాప్తంగా 40 ప్రదేశాలలో నిర్వహించబడుతుంది. ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్న ప్రధానమంత్రి లక్ష్యానికి అనుగుణంగా ఈ రోజ్‌గర్ మేళా జరగనుంది. దేశ నిర్మాణానికి తోడ్పడేందుకు యువకులకు సరైన అవకాశాలను అందించడం ద్వారా వారికి సాధికారతను కల్పిస్తుంది. ఇందులో అందుబాటులో ఉన్న ఒక వెయ్యి 400కు పైగా ఇ-లెర్నింగ్ కోర్సులు యువతకు, వికసిత్ భారత్ నిర్మాణానికి దోహదపడతాయి.

=================================

విపత్తు సంసిద్ధత, ప్రతిస్పందన కోసం కమ్యూనిటీ వాలంటీర్లకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర హోం శాఖ యువ ఆపద మిత్ర పేరిట ఒక పథకాన్ని రూపొందించింది. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఈ పథకాన్ని ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు. ఈ పథకం కింద నేషనల్ క్యాడెట్ కార్ప్స్, నెహ్రూ యువ కేంద్ర సంగటన్, నేషనల్ సర్వీస్ స్కీమ్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన రెండు లక్షల 37 వేల మంది వాలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఏదైనా విపత్తు సంభవించినప్పుడు సమాజాన్ని సన్నద్ధం చేయాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచనకు అనుగుణంగా ఈ పథకం రూపొందించారు.

విరామం

=================================

ఖరీఫ్ సీజన్ కి సంబంధించి 185 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పంజాబ్‌లో అక్టోబరు 1వ తేదీన అధికారికంగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని, కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు 2 వేల 700 కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ధాన్యం మిల్లుల యజమానుల ఫిర్యాదుల పరిష్కారానికి త్వరలో ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభమవుతుందన్నారు. సెప్టెంబరులో భారీ వర్షాల కారణంగా వరిలో తేమశాతం అధికంగా ఉండడంతో కోతలు,

కొనుగోళ్లు ఆలస్యమయ్యాయని ఆయన వివరించారు. కేంద్ర మంత్రి ఈరోజు న్యూఢిల్లీలో రైస్ మిల్లర్ల కోసం FCI ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (FCI GRS) మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించారు.

====================================

డిస్లెక్సియా వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్, పార్లమెంట్, ఇండియా గేట్ సహా పలు ప్రముఖ ప్రభుత్వ భవనాలపై ఎరుపురంగు దీపాలను ఏర్పాటు చేశారు. ఈ వ్యాధిపై అవగాహన పెంచడం, వ్యాధిని నియంత్రించడంతో పాటు, ఈ వ్యాధిపై ఉన్న వివక్షను తొలగించడం లక్ష్యంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలను అంతర్జాతీయ డిస్లెక్సియా అవగాహన మాసంగా పరిగణిస్తారు. ఇందులో భాగంగా ఈ వ్యాధిపై అవగాహనను పెంచేందుకు ఢిల్లీలోని విజయ్ చౌక్ నుండి ఇండియా గేట్ వరకు “వాక్ ఫర్ డిస్లెక్సియా” పేరిట వాక్‌థాన్ కూడా నిర్వహించారు.

====================================

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ రేపటి నుండి రెండు రోజుల పాటు సౌదీ అరేబియాలో పర్యటించనున్నారు. భారత్ - సౌదీ అరేబియా దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, వాణిజ్యం, పెట్టుబడులు, నూతన ఆర్థిక మార్గాలను అన్వేషించడం లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. రియాద్‌లో జరిగే ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ (ఎఫ్ఐఐ) 8వ ఎడిషన్‌లో కేంద్రమంత్రి పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రపంచ నాయకులు, పెట్టుబడుదారులు, వాణిజ్య సంస్థల ప్రతినిధులను కలవనున్నారు. అలాగే కేంద్ర మంత్రి రియాద్‌లోని లులు హైపర్ మార్కెట్‌లో దీపావళి ఉత్సవ్‌ను ప్రారంభిస్తారు. భారత సంతతికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్‌లు, వివిధ రంగాలకు చెందిన వారితో సమావేశమవుతారు.

====================================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోగ్య సంరక్షణ రంగానికి  సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలను రేపు ప్రారంభించనున్నారు. సుమారు 12 వేల 850 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి రేపు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని దేశంలోని మొదటి ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద రెండవ దశను నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఇందులో పంచకర్మ ఆసుపత్రి, ఔషధాల తయారీకి ఆయుర్వేద ఫార్మసీ, స్పోర్ట్స్ మెడిసిన్ యూనిట్, సెంట్రల్ లైబ్రరీ, IT, స్టార్టప్‌ల ఇంక్యుబేషన్ సెంటర్ లు ఉన్నాయి.

====================================

విదేశీ మదుపర్ల అమ్మకాలు, బలహీన త్రైమాసిక ఫలితాల కారణంగా స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాల్లో కొనసాగాయి. ఉదయం సెన్సెక్స్ 79,653 వద్ద ప్రారంభమై మార్కెట్ ముగిసే సమయానికి 80,005 వద్ద ముగిసింది. నిఫ్టీ 158 పాయింట్ల లాభంతో 24,339 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.07 వద్ద ముగిసింది. అలాగే బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

====================================

పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు యువ పారిశ్రామిక వేత్తల సహకారం ఎంతో ఆవశ్యకమని నేవల్ స్టాఫ్ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి అన్నారు. ఈరోజు ఆయన న్యూ ఢిల్లీలో ఇండియన్ నేవీ  నావల్ ఇన్నోవేషన్ అండ్ ఇండిజినైజేషన్ సెమినార్, స్వావలంబన్ - 2024 మూడవ ఎడిషన్‌ను ప్రారంభించారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఇండియన్ ఆర్మీ, ఇండియన్ కోస్ట్ గార్డ్, సరిహద్దు భద్రతా దళాలతో సహా వివిధ ఏజెన్సీలు సుమారు 115 స్టాళ్లను ఏర్పాటు చేశాయన్నారు. భారత నావికాదళం ఆవిష్కరణలను, స్వదేశీకరణ ప్రయత్నాలను ప్రోత్సహించేందుకు ఏర్పాటైన ఈ రెండు రోజుల కార్యక్రమంలో పలు సంస్థలు, అంకుర సంస్థలు పాల్గొంటున్నాయి.

===================================

===================================